

సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న బియ్యం తరలిస్తున్న ఆటోలు (ఫైల్)

- పట్టుకుంటున్నా ఆగని దందా
- కొన్ని సందర్భాల్లో క్వింటాళ్ల కొద్ది రవాణా
- చేతులు మారుతున్న కోట్లాది రూపాయలు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 22 : రేషన్ బియ్యం కాగజ్‌నగర్ డివిజన్‌లో సరిహద్దులు దాటి పోతోంది. నిత్యం పదుల సంఖ్యలో లారీలు, వ్యాన్‌లు, ఆటోల్లో సరిహద్దులు దాటిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులకు అండగా కొంతమంది అధికారులు నిలుస్తుండడంతో దళారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిలుతోంది. మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వదిలేయడంతో స్మగ్లర్లు యథేచ్ఛగా బియ్యాన్ని పొరుగున ఉన్న మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఇటీవల పలు వాహనాల్లో తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని సిర్పూర్(టి), బెజ్జూరు, చింతలమానేపల్లి, కౌటాల తదితర మండలాల్లో నుంచి నిత్యం బియ్యం తరలిస్తున్నారు. ఆయా మండలాల్లో రేషన్ బియ్యం తక్కువ ధరలకు కొనుగోలు చేసి మహా రాష్ట్రలో రూ.22నుంచి 25వరకు అమ్ముతున్నారు. రేషన్ బియ్యంపై నిఘా ఉంచాల్సిన సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్ మెంటు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. అక్రమార్కులకు రాజకీయ అండ, అధికారులకు ఒత్తిళ్ల కారణంగానే లక్షల రూపాయల బియ్యాన్ని బాహాటంగా తరలిస్తున్నారని సమాచారం. కొంతమంది డీలర్లు సైతం దళారులతో చేతులు కలిపి వ్యాపారం కొనసాగించేందుకు సహకరిస్తున్నట్లు సమాచారం. కేవలం ఒక్క నెలలోనే వందలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిందంటే గుట్టుచప్పుడు కాకుండా ఇంకా ఎన్ని క్వింటాళ్లు తరలిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

కాగజ్‌నగర్-మహారాష్ట్ర సరిహద్దు కావడంతో

మహారాష్ట్రకు కాగజ్‌నగర్ డివిజన్ చుట్టూ సరిహద్దు మండలాలతో ఉండడంతో స్మగ్లర్లకు కలిసి వస్తోంది. కాగజ్‌నగర్ మీదుగా సిర్పూర్ మండలంలోని వెంకట్రావ్‌పేట, హుడ్కిలి గ్రామాల నుంచి, చింతలమానేపల్లి మండలంలోని గూడెం, కౌటాల మండలం నుంచి ప్రాణహిత మీదుగా, బెజ్జూరు మండలం సోమిని, మొగెల్లి, ప్రాణహిత మీదుగా, దహెగాం మండలం నుంచి పెంచికలపేట మీదుగా మహారాష్ట్రకు రేషన్ బియ్యం తరలిస్తున్నారు. దీంతోపాటు బెల్లంపల్లి, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి కూడా బియ్యం తరలిస్తున్నారు.

రైస్ మిల్లుల్లోకి రేషన్ బియ్యం..

మహారాష్ట్రకు రేషన్ బియ్యం తరలించం ఒక ఎత్తయితే స్థానికంగానే రైస్‌మిల్లులకు కూడా తరలించి సొమ్ము చేసుకోవడం మరో ఎత్తుగడ. ఇలా పలు రైస్‌మిల్లులకు దహెగాం, బీమిని, కాగజ్‌నగర్ మండలాల నుంచి బియ్యం తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. స్థానిక రేటును బట్టి దళారులు మహారాష్ట్రకు తరలించడమా, లేదంటే ఇక్కడే అమ్మడమా అనేది జరుగుతోంది. చిన్నా, చితకా ఆటోలు, ట్రాలీలు, చిల్లర కొనుగోలు చేసే వ్యక్తులు బియ్యాన్ని స్థానికంగా అమ్ముకుంటున్నారు. రాత్రి వేళల్లో పలు రైసుమిల్లుల్లోకి భారీగా రేషన్‌బియ్యం తరలిస్తున్నారు. గతంలో విజిలెన్స్ అధికారులు పలు మిల్లులపై దాడులు కూడా నిర్వహించిన సంఘటనలున్నాయి. ఏదేమైనా జిల్లా వ్యాప్తంగా కాగజ్‌నగర్ డివిజన్ నుంచి భారీగా రేషన్ బియ్యం నిల్వ ఉంచడం, తరలించడం జరుగుతూ కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నా యని చెప్పవచ్చు.

రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22: రాజీమార్గం ద్వారా జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధానన్యాయాధికారి ఎంవీ రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రత్యేకసబ్‌జైలులో ధ్యానంతో సంతోషం, ఆరోగ్యం అంశంపై విచారణ ఖైదీలకు ఏర్పాటుచేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ధ్యానంతో ఆరోగ్య, మానసికమైన ప్రయోజనాలు పొందవచ్చన్నారు. చెడును పారదోళి సహన శక్తిని అలవర్చుకోవాలన్నారు. ఈనెల28న జరిగే జాతీయలోక్‌అదాలత్‌లో కేసులను రాజీచేసుకోవచ్చని అవసరమైన వారికి ఉచితంగా న్యాయవాదులను నియమించి న్యాయసేవలను అందిస్తామన్నారు. అనంతరం జైలులో ఖైదీల వసతులు, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ, జైలుసూపరింటెండెంట్ ప్రేంకుమార్, బ్రహ్మకుమారి రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై అవగాహన



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: కాగజ్‌నగర్ పట్టణంలో సర్దార్ బస్తీలో ఆదివారం ఆర్పీఎఫ్(రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) ఆధ్వర్యంలో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే భద్రత దళం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా తప్పకుండా పాటించాలన్నారు. తద్వారా ఎలాంటి వ్యాధులు దరికి రావన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రాచీదేవి, ఏఎస్ఐ దాస్, యువకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దేశీదారు స్వాధీనం



పట్టుకున్న దేశీదారుతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: కాగజ్‌నగర్ చారిగాంలో అక్రమంగా దేశీదారు అమ్మకాలు సాగిస్తున్న వారిని పట్టుకున్నట్టు టాస్క్‌ఫోర్సు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తుగా అందిన సమాచారం మేరకు చారిగాంలో దాడులు నిర్వహించగా, మహేష్, రాజు, సంతోష్ దేశీదారు సరఫరా చేస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. దేశీదారు విలువ రూ.55వేల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్సు ఎస్సై వెంకటేష్, సిబ్బంది, కానిస్టేబుళ్లు మధు, రమేష్ పాల్గొన్నారు.

'ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు'

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: తన వ్యక్తిగత వీడియోలను వైరల్ చేస్తున్నారని కొంత మందిపై పోలీస్‌స్టేషన్‌లో కొన్నిరోజుల క్రితం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవటం లేదని పట్టణానికి చెందిన ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనవ్యక్తిగత వీడియోలు మద్యం దుకాణంలో ఉన్న యువకుడి వద్ద ఉన్నట్టు సమాచారం తెలుసుకొని ప్రశ్నించేందుకు వెళ్లితే తనపైనే పోలీసుల సమక్షంలో రెండ్రోజుల క్రితం దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించటం ఎంతవరకు సమంజసమన్నారు. తనపై దాడి చేసిన నవీన్‌గౌడ్, వంశి, శివ భరత్‌పై కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. జిల్లాఎస్పీకి కూడా ఫిర్యాదుచేసినట్టు తెలిపారు. అయితే ఇంతవరకు వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా తెలిపారు. ఈ అవకాశాన్ని సిర్పూరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల కమిటీ నియామకం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22: ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలి సేవాసంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఆదివారం ఎన్నికల కమిటీని నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్లా ఆంజనేయులు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా ప్రకాష్, సభ్యులుగా తిరుపతయ్య, రవీందర్, మధుకర్‌ను నియమించామని అన్నారు. ఎన్నికల నిబంధనలు, తేదీని త్వరలో కమిటీసభ్యులు తెలియజేస్తారన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

పెంచికలపేట, సెప్టెంబరు 22:వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆగర్‌గూడ గ్రామస్థులువర్షాలు కురవాలని గ్రామసమీపంలోని భీమన్న దేవరను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ప్రతి యేటా భీమన్నదేవుడికి పూజలు చేస్తే వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు పండుతాయని గ్రామస్థుల నమ్మకం.

ఆసుపత్రి అభివృద్ధి నిధుల కోసం నిరీక్షణ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: జిల్లాలో ప్రతి ప్రభుత్వాసుపత్రికి ఆసుపత్రి అభివృద్ధి నిధుల (హెచ్‌డీఎఫ్) నుంచి రూ.5లక్షల మేర ఏటా ప్రభుత్వం కేటాయించేది. ఈనిధులతో ఆసుపత్రిలో అత్యవసరమున్న వాటిని కొనుగోలు, ఇతరాత్ర పనుల కోసం వినియోగించే వారు. ప్రస్తుతం ఆ నిధులు విడుదల కాకపోవటంతో వివిధ ఆసుపత్రుల్లో అభివృద్ధిపనులు జరగటం లేదు. నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినప్పటికీ ఇంతవరకు విడుదల కావటం లేదని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో అభివృద్ధి పనులు కాకపోవటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి హెచ్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలని ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.



ఆసిఫాబాద్‌లో విశ్వప్రసాద్‌రావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వాంకిడిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్/తిర్యాణి/వాంకిడి/రెబ్బెన, సెప్టెంబరు 22: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంతోపాటు తిర్యాణి, వాంకిడి మండ లాల్లో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు జన్మదిన వేడకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్ రావును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తిర్యాణి, వాంకిడి, రెబ్బెన మండలాల్లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు హరీష్, రాజశేఖర్, అమర, సాయికిరణ్, కమల, కొమురయ్య, రాహుల్, సురేష్, రంజిత్, సాయి, రమేష్, రమాకాంత్, మంగు, నారాయణ, ప్రశాంత్, సుధాకర్, అనీల్, జీవన్, హనుమంతు, రెబ్బెనలో మండల కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, మాజీజడ్పీటీసీలు దుర్గంసోమయ్య, వేముర్ల సంతోష్, గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు చెన్న సోమశేఖర్, మానెం కార్తీక్, చిరంజీవి, గాజుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

26న కార్మికులతో సమావేశం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: సిర్పూరు పేపర్ మిల్లు మజ్దూర్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల26న ఎస్పీఎం కార్మికులతో సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధానకార్యదర్శి కూశన్న రాజన్న తెలిపారు. ఈ సమావేశానికి కార్మికులు తప్పకుండా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక కార్మికుల సమస్యల పరిష్కా రం కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. ఎస్పీఎం కార్మికుల విషయంలో కూడా భవిష్యతులో పోరాడే అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఎస్పీఎం కార్మికులు విధిగా హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణమాచారి, అంగలశ్రీనివాస్, సదయ్య, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూశన రాజన్న

చెక్ అందజేసిన ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: గణేష్‌నిమజ్జనంలో మున్సిపల్ కాంట్రాక్టుకార్మికుడు నగేష్ క్రేన్‌టైర్ కిందపడి చనిపోగా తనవంతుగా ఆర్థిక రూ.లక్ష అందజేస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు.. ఆమొత్తాన్ని ఆదివారం నగేష్ ఇంటికి వెళ్లి రూ.లక్ష చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతి చెందిన నగేష్‌కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సింధం శ్రీని వాస్, అరుణ్ లోయా, శ్రీదేవి, పట్టణ ప్రధానకార్యదర్శి తిరుపతి, మాచర్ల శ్రీనివాస్, చిప్పకుర్తి శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



వాస్తవ లాభాలను చెల్లించాలి: హెచ్‌ఎంఎస్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 22: కార్మికులకు లాభాల వాటా చెల్లింపులో తీవ్రఅన్యాయం జరుగుతోందని హెచ్‌ఎం ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ మండిపడ్డారు. ఆదివారం మందమర్రిలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023-24ఆర్థిక సంవత్సరానికి 33శాతం లాభాల వాటా ప్రకటించిందని తెలిపారు. మొత్తం వాస్తవ లాభాలను 4701 కోట్లు ప్రకటిం చిందని, ఇందులో 33 శాతం 1500 కోట్లుఅని, కానీ 700కోట్లు ఎలా ప్రకటిస్తారనే లెక్కలు అర్థంకావడం లేదన్నారు. గుర్తింపు సంఘం నాయకులు దీన్ని అడగలేదని ఇది విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, వెల్డి సుదర్శన్, పార్వతి రాజిరెడ్డి, శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 22: కార్మికులకు 2023-24ఆర్థిక సంవత్సరానికి తమ ప్రభుత్వం మెరుగైన లాభాల వాటా ఇప్పిస్తే టీబీజీకేఎస్ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ వాస్తవ లాభాలను ప్రకటించి 33శాతంవాటా ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. సమావేశంలో నాయకులు నరేందర్, లక్ష్మణ్, వెంకటస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా కాంట్రాక్టు కార్మికులకు వరం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22: ఐదువేల రూపాయల లాభాలవాటా కాంట్రాక్టు కార్మికులకు వరమని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసు అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీకార్మికులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో ఈ వాటా మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సర్వ శ్రీనివాస్, నర్సింగ్, రాజేశ్, శ్రీనివాస్, వేణు, రమేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జీఎం


మందమర్రిటౌన్, సెప్టెంబరు 22: మంచిర్యాలఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావును ఆదివారం ఆయననివాసంలో మందమర్రిఏరియా జీఎం దేవేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్క రించుకుని పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణికి సంబంధించిన విషయాలపై చర్చించారు.

ఆరోపణలను ఖండిస్తున్నాం : ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 22: తమ యూనియన్‌కు చెందిన నాయకులు మైనింగ్ సిబ్బందిని బెదిరిస్తున్నారని కొన్ని కార్మికసంఘాల నాయకులు ఆరోపించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మా బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గని మేనేజర్‌తో మాట్లాడుతున్న సందర్భంలో మైనింగ్‌స్టాఫ్ సూపర్‌వైజర్ జోక్యం చేసుకోవడంతో వారి నడుమ వాగ్వాదం జరిగిందన్నారు. వెంటనే తాము మైనింగ్‌స్టాఫ్ నాయకులతో మాట్లాడి సమస్య పరిష్కరించామన్నారు. పనిస్థలాల్లో మనస్పర్థలు రావడం సహజమేనని, కొంతకాలానికి అవి సమసిపోతాయన్నారు. ఇతర సంఘం నాయకులు వాటిని పెద్దవి చేయడం తగదని హితవు పలికారు.

'సింగరేణి శ్వేతపత్రం విడుదల చేయాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22: గతఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలపై సింగరేణి శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ సాధించినలాభం నుంచి 33శాతం చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం కేవలం 16.9శాతం మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. లాభాలపై శ్వేతపత్రం విడుదల చేసి మిగతాడబ్బులు కార్మికులకు అందించాలని కోరారు. సమావేశంలో బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, పురుషోత్తం చారి పాల్గొన్నారు.



దేవుడి సొమ్ము అమ్మేందుకు వచ్చి చిక్కిన దొంగ

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: రామగుండం విద్యుత్‌నగర్‌లో హనుమాన్ టెంపుల్‌లో కిలోకుపైగా వెండిఆభరణాలు చోరీచేసి ఆ సొత్తును గోదావరిఖని స్వర్ణకారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదివారం స్వర్ణకారులు ఇచ్చిన సమాచారంతో రామగుండం వాసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... రామగుండం విద్యుత్‌నగర్‌లోని హనుమాన్‌దేవాలయంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. దేవునికి అలంకరించిన కిలో వెండివస్తువులు, కొంత బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులుఎత్తుకెళ్లారు. ఆదివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక స్వర్ణకారున్ని సంప్రదించిన దొంగలు తాము వెండివస్తువులు తీసుకువస్తామని చెప్పారు. చోరీజరిగిన సమాచారం ఉన్నసదరు స్వర్ణకారుడు రామగుండంలోని అతనిసోదరునికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయపూజారితోపాటు కాలనీవాసులు ఆదివారం లక్ష్మీనగర్‌లో కాపుకాశారు. సదరుదొంగ ఆభరణాలతో రాగానే పట్టుకున్నారు. అతన్నిగోదావరిఖనివన్‌టౌన్‌పోలీసులకు అప్పగించారు.

బస్సులో మర్చిపోయిన రూ.2 లక్షలు అప్పగింత

మంథని, సెప్టెంబర్ 22: ఆర్టీసిబస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ.2లక్షలను మంథని డీఎంశ్రావణ్‌కుమార్ తిరిగి ప్రయాణికుడు జే. రమేష్‌కు స్థానిక డిపో అవరణలో ఆదివారం అప్పగించారు. మంథని డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో కాటారంలో జే. రమేష్ అనే ప్రయాణీకుడు బస్సు ఎక్కి ప్రయాణం చేశాడు. ఈక్రమంలో తన వెంట ఉన్న కవర్‌లో రూ.2లక్షలను సీటులోనే ఉంచి మర్చిపోయి భూపాలపల్లిలో దిగిపోయాడు. ఆతర్వాత గుర్తించి భూపాలపల్లి డిపోలో సెక్యూరిటీ సిబ్బందిని కలిసి సమాచారం ఇచ్చారు. వారు మంథని డీఎంకు సమాచారం ఇవ్వడంతో బస్సును గుర్తించి కండక్టర్ ద్వారా సదరు నగదు ఉన్న కవర్‌ను గుర్తించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈమేరకు సమాచారం ఇవ్వడతో రమేష్ మంథనికి వచ్చి తన రూ. 2 లక్షల నగదు కవర్‌ను డీఎం శ్రావణ్‌కుమార్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మర్చిపోయిన తన రూ.2లక్షలను తిరిగి క్షేమంగా అప్పగించిన డీఎం శ్రావణ్‌కుమార్, కండక్టర్ తిరుపతమ్మ, డ్రైవర్ మొగిలికి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో పిచ్చి కుక్కల దాడి

రెబ్బెన, సెప్టెంబరు 22: రెబ్బెన మండలంలోని గోలేటి, నంబాల, పులికుంట, ఖైరిగూడ గ్రామాల్లో ఆదివారం పిచ్చికుక్కలు దాడిచేసి పలువురిని గాయపరిచాయి. గోలేటిలో జి సతీష్, ఎం భరత్, సరోజ, జిమ్మబాయి, పులికుంటలో భీమయ్య, శ్రీనివాస్, నంబాలో కళావతి, చిన్నక్కతోపాటు సంజయ్ అనే బాలుడిని తీవ్రంగా గాయపరిచాయి. వారికి స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేయించారు.

అందని వైద్య సేవలు

● ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
● సిబ్బంది కొరత

జన్నారం, సెప్టెంబరు 22: జన్నారం మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ఇస్తున్న హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఆసుపత్రి తీరు మారడం లేదని ప్రజలు పేర్కొంటు న్నారు. మండలంలో అత్యధికంగా మారుమూల గ్రామాలున్నాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన ఆదివాసీలు, గిరిజనులతో పాటు సామాన్యప్రజలు ఆరోగ్యకేంద్రానికి వస్తుంటారు. రోజు సుమారు 100 నుంచి 130 మంది ఓపీ ఉంటుంది. అయితే ప్రభుత్వాలు మాత్రం ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయడం లేదు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో రోగులు పెద్ద మొత్తంలో ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. తగిన సిబ్బంది, పడకలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులు నేలపైనే ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.



జన్నారంలోని ప్రభుత్వ ఆసుపత్రి

-పురుటినొప్పులు వస్తే అంతే..

మండలంలోని కవ్వాల, హాస్టల్ తండా, అల్లినగర్, దొంగపల్లి, మల్యాలతో పాటు పలు గిరిజన గ్రామాలు, తండాలు, ఆదివాసీ గూడాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని వారందరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. మహిళలకు పురుటినొప్పులు వచ్చాయంటే నార్మల్ డెలివరీ చేయడానికి మాత్రమే వీలుంటుంది. ఆరోగ్య కేంద్రంలో రెండు వైద్యాధికారులకు గాను ఒకరే ఉన్నారు. సీజేరియన్ చేయాలంటే 50 కిలోమీటర్ల దూరంలో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాల్సిందే. దీంతో కడుపులో ఉన్న బిడ్డకు, తల్లికి ప్రమాదం జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

-వెక్కిరిస్తున్న ఖాళీలు...

మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 13 పడకల పరిమితి మాత్రమే ఉంది. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులకు గాను ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఈ ఆసుపత్రిలో అటెండర్ లేదు. స్వీపర్ పోస్టు సైతం ఖాళీగా ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

-ఉమాశ్రీ , ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందాలంటే మరో డాక్టర్‌ను నియమించడంతో పాటు వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి. రోజుకు వంద మందికి పైగా రోగులు వస్తుంటారు. అయినా ఉన్న సిబ్బందితో వైద్యం అందిస్తున్నాం.

అత్తను చంపిన అల్లుడి ఆత్మహత్య


మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 22: జిల్లా కేంద్రంలోని భగవంతంవాడకు చెందిన అత్తను హతమార్చిన అల్లుడు శాతం వెంకటేష్ (32) అనే నిందితుడు గోదావరిఖని బ్రిడ్జి పై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. జూలై 13న నిందితుడు వెంకటేష్ అతని అత్త నెల్లి విజయను కుటుంబకలహాలతో కత్తితో పొడిచి హతమార్చడంతో పాటు అదే కత్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న వెంకటేష్‌ను రిమాండ్ చేయగా ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. అత్తను చంపిన కేసులో జైలు శిక్ష పడుతుందని భావించిన వెంకటేష్ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావును వివరణ కోరగా వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నది వాస్తవమేనని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

గుంజాల గోండి లిపి, భాషా పండితుడు

కోట్నాక్ జంగు కన్నుమూత

● గుంజాల గోండి లిపి ఆధునికీకరణలో ముఖ్యపాత్ర
● అదే లిపిలో స్వీయచరిత్ర రాసిన జంగు
● గోండు జాతి పుట్టుక కథల సేకరణలోనూ సహకారం
● అతని మరణం గుంజాల గోండి లిపికి తీరని లోటు
● ఆచార్య జయధీర్ తిరుమల రావు,

గూడూరు మనోజ తదితరులు


కోట్నాక్ జంగు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): గుంజాల గోండి లిపి, భాషాపండితుడు కోట్నాక్ జంగు(90) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలం, గుంజాల గ్రామంలో తుదిశ్వాస విడిచారు. జంగు... గోండి, తెలుగు, ఇంగ్లిషు, మరాఠా భాషల్లో ఏడో తరగతి వరకు విద్య అభ్యసించారు. గుంజాల గోండి లిపి అభివృద్ధి నిర్మాతలు.. పెందోర్ లింగోజీ, కుంరా గంగోజీ రాసిన 12ప్రతు లను జంగు చదవడమేగాక, వాటిని భద్రపరిచాడు. తర్వాత కాలంలో అవి గుంజాల గోండి లిపి ఆధునికీకరణకు ఎంతగానో తోడ్పడ్డాయి. ఆ లిపిలో రాయడం, చదవడంలో ఆయన నిష్ణాతుడు. గుంజాల గోండి లిపిలో గోండి భాషలో తన స్వీయచరిత్ర రాశాడు. ఆ భాషలో 10వేల క్లోల సంఖ్యవరకు జంగు వివరించేవారని గుంజాల గోండి లిపి అధ్యయనవేదిక కన్వీనర్ ఆచార్య గూడూరు మనోజ చెబుతున్నారు. గోండీల సాంస్కృతిక మూలాలను అలవోకగా వివరించేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. గోండు జాతి పుట్టుక కథల సేకరణలోనూ తన వంతు సహకారం అందించారు. గుంజాల గోండి లిపిని యూనికోడ్ ప్రమాణంలోకి తీసుకురావడం, ఫాంట్ ఆవిష్కరణ, వాచకాల రూపకల్పన తదితర విషయాల్లో జంగు ప్రముఖపాత్ర పోషించారని ఆ లిపి సేకర్త ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. ఆయన మరణం గోండి భాషకు, గుంజాల లిపికి తీరనిలోటు అని అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు వి. కృష్ణ, ఆర్.ఎస్ సర్రాజు జంగు మృతికి సంతాపం ప్రకటించారు. కోట్నాక్ జంగు అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం గుంజాల గ్రామ శ్మశానవాటికలో పూర్తయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రంగి, సెప్టెంబరు 22: రుద్రంగి మండల కేంద్రంలో ఆదివారం బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. కథలాపూర్ మండలం కలికోటకు చెందిన దేవరాజం ద్విచక్రవాహనంపై చందుర్తి మండలం మల్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రుద్రంగిలోని ఇందిరాచౌక్ వద్ద కుక్కలా గుంపు బైక్ వైపు రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. దేవరాజం కాలువిరిగింది. బైక్‌వెనకాల కూర్చున్నమహిళకు గాయాలయ్యాయి. వెంటనేస్థానికులు వేములవాడప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నామాపూర్‌లో గంజాయి పట్టివేత

పెగడపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని నామాపూర్‌గ్రామ శివారులో ఆదివారం గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. నామాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్యప్రదేశంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీస్‌సిబ్బంది తిరుపతి, రాజేష్, సంపత్, ఎల్లయ్యలు ఒకబృందంగా ఏర్పడిగంజాయి సేవిస్తున్న తోడేటి వెంకటేష్ ధర్మపురి మండలం తిమ్మాపూర్, బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన లింగాలవంశీ,చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గుండేటి ప్రవీణ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 500గ్రాములు గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.











పోలీసుల పల్లె నిద్ర

వేమనపల్లి, సెప్టెంబరు 22 : మండలంలోని కొత్తగూడెం లో శనివారం రాత్రి పోలీసు లు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఎస్‌ఐ శ్యామ్ పటేల్ గ్రామస్థులతో మాట్లా డుతూ గ్రామాల్లో నేరాలను నియంత్రించడానికే పల్లె నిద్ర చేపడుతున్నామన్నారు. ప్రజ లు గ్రామాల్లో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. సైబ ర్ మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

-వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

వేమనపల్లి మండలంలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. మావోయిస్టు పార్టీ సంస్థాపన వార్షికోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీల్వాయి పోలీసులు వాహనాలు తనిఖీ చేసి ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు. గుర్తింపు పత్రాలను పరిశీలించారు. నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్, పోలీసులు పాల్గొన్నారు.

గీత కార్మికులు రక్షణ కవచం వాడాలి



రక్షణ కవచంతో చెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 22: గీత కార్మికులు ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి కాటమయ్య రక్షణ కవచం వాడాలని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం తాళ్లగురిజాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచంపై శిక్షణ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో చెట్టు నుంచి జారిపడి మృత్యువాత పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, దీంతో ప్రభుత్వం ప్రమాదాలను అరికట్టేందుకు కాటమయ్య రక్షణ కవచం తీసుకువచ్చిందన్నారు. రక్షణ కవచం ఉపయోగించి గీత కార్మికులు చెట్లు ఎక్కితే ప్రమాదాలు జరగవని తెలిపారు. త్వరలో ప్రతి గీత కార్మికునికి పంపిణీ చేస్తామన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే



బెల్లంపల్లి, సెప్టెంబరు 22 : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఆదివారం హైదరాబాద్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎల్పీ సమావేశాల్లో భాగంగా మంత్రిని కలిసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించాలి



మాట్లాడుతున్న తపస్ సంఘం నాయకులు

చెన్నూరు, సెప్టెంబరు 22: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన మార్గదర్శకాలు సహేతుకం కాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015 నాటి రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం 10 మందికి ఒక టీచర్, 60 మందికి ఇద్దరు టీచర్లు అనే నిబంధన అమలు చేయాలనుకోవడం సరికాదని, ఇది ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. 20 మంది వరకు ప్రతీ పాఠశాలకు ఇద్దరు టీచర్లను, 50 మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలకు ఒక హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలని, ప్రతీ తరగతికి ఒక టీచర్‌ను నియమించినప్పుడే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ఫలితాలు వెల్లడించి ఉపాధ్యాయులను వెంటనే నియమించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సాంబయ్య, నాగరాజు, చందు, ప్రవీణ్‌కుమార్, సునీల్ పాల్గొన్నారు.

నిబంధనలను మార్చాలి

మంచిర్యాల అర్బన్: రేషనలైజేషన్ జీవో నెంబర్ 25 నిబంధనలను మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు డిమాండ్ చేశారు. తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా సర్దుబాటు ఉత్తర్వులను కలెక్టర్లను ఆదేశించడాన్ని ఖండిస్తున్నామన్నారు. 11 మంది విద్యా ర్థులు ఉన్న పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను, 60 మంది ఉన్న పాఠశాలకు ఇద్దరే ఉపాధ్యాయు లను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమైన విషయమన్నారు. 40 మంది వరకు ఇద్దరు, 60 మందికి ముగ్గురు, 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడి చొప్పున కేటాయించాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు ప్రక్రియ ద్వారానైనా బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు.

ఏజెన్సీ ఎస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకులు

దండేపల్లి,సెప్టెంబరు 22: ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల ఎస్సీలకు ప్రత్యేకమైన కార్పొరేషన్ ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక దళిత రత్న అవార్డు గ్రహీతను ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబులను సంఘం నాయకులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేస్తున్నందున పంచాయతీరాజ్ ఎన్ని కల్లో ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపి ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం చేయాలన్నారు. 2018-19 పంచాయతీ ఎన్ని కల్లో ఏజెన్సీ గ్రామాల్లో ఎస్సీ వార్డు సభ్యుల రిజ్వరేషన్ తొలగించి అన్యాయం చేశారని ఆరోపించారు. ఏజెన్సీలో ఎస్సీ వార్డు సభ్యుల రిజ్వరేషన్ మళ్లీ కేటాయించాలన్నారు. గిరిజనులు లేని గ్రామ పంచా యతీల్లో ఎస్సీలకు అవకాశం కల్పించే విధంగా ప్రభు త్వం ప్రత్యేక చర్యలు చేపట్టి ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు, నాయరనాయక్, శశికుమార్, అనిల్, దుర్గయ్య, పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుపై హర్షం



జన్నారం, సెప్టెంబరు 22 : రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ ఆదివారం తపాలపూర్ గల్ఫ్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు తపాలపూర్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం తపాలపూర్ గల్ఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవస్థాపకుడిగా అశోక్, ప్రెసిడెంట్‌గా సురేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిరణ్, అకౌంటెంట్‌గా ప్రభాకర్, ప్రచార కార్యదర్శిగా గంగన్న, ఉప కార్యదర్శిగా శంకర్, సలహాదారులుగా రవి, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

అంతిమ యాత్ర కష్టాలు



అండర్ బ్రిడ్జిలో నీటిలో నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

తాండూర్, సెప్టెంబరు 22: మండలంలోని బోయవాడకు చెందిన ముష్కె రాజం (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లేందుకు బంధువులు ఇబ్బందులు పడ్డారు. శ్మశాన వాటికకు నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఆదివారం ఉదయం భారీ వర్షం కురవడంతో అండర్ బ్రిడ్జిలో వరద నీరు చేరింది. రాజం మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లేందుకు మోకాళ్ల లోతు నీటిలో ఒకరి చేతులు ఒకరు పట్టుకుని అష్టకష్టాలు పడుతూ రైల్వే అండర్ బ్రిడ్జిని దాటి శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 22: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంచిర్యాల నియోజకవర్గ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు పాల్గొన్నారు. చెన్నూరు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు బాల్కసుమన్, దుర్గం చిన్నయ్యలు ఉన్నారు.

బెల్లంపల్లి: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం హైద్రాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కలిశారు. సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సమావేశం నిర్వహించారని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

వేమనపల్లి, సెప్టెంబరు 22: వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన ఆకుల అంకు (40) అనే దివ్యాంగురాలు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంకు ఇటీవల మానసిక స్థితి సరిగ్గా లేక పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తోంది. చనిపోయిన తల్లిని గుర్తు చేసుకుంటూ ఈ నెల 20న మధ్యాహ్నం ఉరి వేసుకోగా ఆమె తమ్ముడు అశోక్ కాపాడాడు. ఆదివారం ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధికారుల గదులకు ఆధునిక సొబగులు



ఫైనాన్స్ హెచ్‌వోడీ గది

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 : శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో కొందరు అధికారులు గదులకు హంగులు దిద్దడంపైనే దృష్టి సారించారు. అత్యాధునిక ఫర్నీచర్, మార్బుల్ స్టోన్స్ వేస్తూ కొంగొత్త సొబగులు దిద్దుతున్నారు. ఆయా విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ఇరుకుగా కూర్చున్నా తాము మాత్రం దర్జాగా ఉండాలని భావిస్తున్నారు. సంస్థ సొమ్మును వృథా చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను ధిక్కరిస్తూ లక్షల రూపాయలు వెచ్చిస్తూ అధునాతన ఫర్నీచర్, ఏసీలు, ఇతర సౌకర్యాలతో అలంకరించుకుంటున్నారని సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఫైనాన్స్ విభాగంలో మొదట ప్రారంభమై అన్ని విభాగాలకూ విస్తరిస్తోంది. జీఎం కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే కార్మికులకు మాత్రం సరైన వసతులు ఏర్పాటు చేయడం లేదు. రేకుల షెడ్డులో ఒక క్యాంటీన్ ఉన్నా దానిలో సరైన కుర్చీలు లేవు. వేసవిలో కొందరు ఉద్యోగులు వేడిమిని తట్టుకోలేక సెలవు పెట్టి ఇంట్లోనే ఉండాల్సి వస్తోంది. ఇక గనుల్లో పనిచేసే కార్మికుల సంగతి సరేసరి. సరైన మరుగుదొడ్లు, స్నానాల గదులు, టోపీ, బూట్లు తదితర వస్తువులు పెట్టుకునేందుకు కప్‌బోర్డులు లేవు. అధికారుల గదుల ఆధునీకరణకు వినియోగించే లక్షల రూపాయలు వృథా అవుతున్నాయని సింగరేణి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఉదయం ఒకలా.. సాయంత్రం మరోలా

● పేకాట కేసులో పోలీసుల వైఖరి

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 22: వాంకిడి మండలం సరండి గ్రామ శివారులో పేకాటకేసులో పోలీసుల వైఖరిపై నెలకొన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ వ్యవహారంలో పోలీసులు వ్యవహరించిన తీరు, వారు విడుదల చేసిన ప్రెస్‌నోట్ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. పేకాటలో పట్టుబడ్డనాయకులను రక్షించడానికి ఎంతో మల్లగుల్లాలు పడిపేర్లనే తొలగించి పేకాట ప్రస్తావన లేకుండా మద్యం సేవిస్తూ అనుమానాస్పదంగా కనిపించారనే కారణంతో ఏడుగురిని బైండోవర్ చేసినట్లు సోషల్‌మీడియాలో ప్రకటన విడుదల చేశారు. మళ్లీవారే సాయంత్రంకల్లా మరోప్రకటన విడుదల చేశారు. అందులో పేకాటఆడుతుండగా పట్టుకున్నామని, మరోనలుగురు వ్యక్తు లు పరారీలో ఉన్నారని స్పష్టంచేశారు.

పైగా గురువారం నమోదయిన ఎఫ్‌ఐ ఆర్ కాపీకూడా సోషల్‌మీడియాలో చక్కర్లుకొట్టింది. అందులోఉన్న విషయమే శనివారం సాయంత్రం విడుదల చేసిన పోలీసుల ప్రకటనలో ఉంది. పైగా ఏడుగురు ప్రముఖనాయకులు పట్టుబడిన వారిలో ఉండగా వారిలో కేవలం నలుగురిని మాత్రమే పరారీలో ఉన్నట్లు చూపారని, మరోనలుగురి పేర్లను పూర్తిగా పక్కనపెట్టారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పైనుంచి వచ్చిన ఒత్తిడితో నాయకులను తప్పించిన పోలీసులు తరువాత సరిచేసుకునే పనిలో పడ్డారు. మీడియా ప్రతినిధులు, ప్రతిపక్షపార్టీల నాయకులు ప్రశ్నించడంతోనే జరిగిన తప్పును ఎలాసరిదిద్దాలని అనేపనిలో పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఇటీవలే కాగజ్‌నగర్‌లో ఇలాగే పేకాట కేసులో జరిగిన పొరపాటు ప్రజలందరికీ తెలిసిందే. మళ్లీ అదేతరహా పొరపాటు జరిగితే పరోక్షంగా పోలీసులే పేకాటను ప్రోత్సహిస్తున్నారనే సందేహం ప్రజల్లో మెదిలే అవకాశాలున్నాయి. ఈపరిస్థితుల్లో జరిగినతప్పిదాన్నిసరిచే సుకునేపనిలోవారు కేసును మార్చి నమోదు చేశారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దారి కష్టాలు తీరేదెన్నడు?

- మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యాలు కరువు
- ఒర్రెలపై హైలెవల్ వంతెనలు లేక అవస్థలు
- వర్షాకాలంలో తప్పని తిప్పలు



కుష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య వాగును దాటుతున్న గ్రామస్థులు(ఫైల్)

బెజ్జూరు, సెప్టెంబరు 22: మారుమూల గిరిజన గ్రామాల్లో కనీసవసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాలకు వెళ్లాలంటే వాగులు దాటాల్సిందే. ఆ వాగులు దాటే సమయంలో గిరిజనుల బాధలు వర్ణనాతీతం. ఇది బెజ్జూరు మండలంలోని పలుగ్రామాల దుస్థితి. మండలంలోని కుష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య రెండు ప్రాంతాల్లో హైలెవల్ వంతెనలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుస్థితి నెలకొంది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకంకింద 2014లో సుశ్మీర్ సమీపంలో ఒర్రెపై వంతెన నిర్మాణానికి రూ.2.15కోట్లు, కుష్ణపల్లి సమీపంలో వంతెన కోసం రూ.2.10కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ వంతెనల నిర్మాణానికి అటవీ అనుమతులు లేవన్న కారణంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య వంతెనలు లేక దాదాపు 10గ్రామాల గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు.

మంజూరైన నిధులు వెనక్కి

కుష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య వంతెనల నిర్మాణానికి మంజూరైన నిధులు ఇటీవల వెనక్కి మళ్లాయి. ఈరెండు వంతెనలు లేక సుశ్మీర్, సోమిని, మొగవెల్లి, సాతసోమిని, గెర్రెగూడ, నాగేపల్లి, బండలగూడ, ఇప్పలగూడ తదితర గ్రామాల ప్రజలకు ప్రతీ ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలోనైతే వారు పడే బాధలు చెప్పదలిచినవి కావు. కనీసం వైద్యానికి వెళ్లాలంటే చుట్టూ వాగుల కారణంగా ఎటూవెళ్లలేని పరిస్థితి. వాగులు ఉప్పొంగినప్పుడల్లా బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయి అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరై దాదాపు పదేళ్లు కావడంతో పనులు చేపట్టక కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం వచ్చిన నిధులను వెనక్కి తీసుకుంది. దీంతో వారికష్టాలు ఎప్పటిలాగే తయారయ్యాయి. గతంలో పలువురు గర్భిణులు వాగుల కారణంగా కాన్పుకోసం అవస్థలు పడ్డ విషయం తెలిసిందే. నాగేపల్లి గ్రామానికి చెందిన ఓ గర్భిణీ వాగు కారణంగా కాన్పుకోసం బయటకు వెళ్లలేక, వైద్యం అందక మృత్యువాత పడింది. అయినా ప్రభుత్వం వంతెనల విషయంలో చొరవ చూపలేక పోయిందని గిరి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాలుగా తిప్పలే..

వాగు అవతలఉన్న గిరిజనగ్రామాల ప్రజలు దశాబ్దాలుగా తిప్పలు పడుతూనే ఉన్నారు. వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో ఎటు వెళ్లాలన్నా వాగులు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఆ గ్రామాలకు వెళ్లేందుకు అవస్థలు తప్పవు. కనీసం 108వాహనం కూడా వెళ్లలేని స్థితినెలకొంది. దీంతో రోగం వస్తే దేవుడిపై భారం వేయాల్సిందే. వంతెనల నిర్మాణాలకు వచ్చిన నిధులుకూడా వెనక్కి మళ్లడంతో ఆయాగ్రామాల ప్రజలకు ఇక వంతెనల ఏర్పాటు కలగానే మిగిలింది. వంతెనల నిర్మాణానికి అప్పట్లో నిధులు మంజూరు కాగా ఎంతోసంతోషపడ్డ ప్రజలకు ఇప్పుడు నిధులు వెనక్కి మళ్లడం చేదు జ్ఞాపకంగా మిగిలింది.

సమస్యలకు నిలయంగా సంక్షేమ విద్య

● అసౌకర్యాల మధ్య చదువులు ● శిథిలావస్థలో కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాల



శిథిలావస్థకు చేరిన కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాల



టాప్‌వాటర్ తాగుతున్న విద్యార్థులు

పెంచికలపేట, సెప్టెంబరు 22: మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. శిథిలమైన భవనంలో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్య అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానాలగదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పుస్తకాలు, ఏకరూపదుస్తులు, స్పోర్ట్స్‌దుస్తులు అందలేదు. వీటికితోడు సరిపడా ఉపాధ్యాయులు లేరు. పెంచికలపేట మండలంలో రెండుగిరిజన బాలురఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి.



ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

ఎల్లూరులో సమస్యల తాండవం..

మండలంలోని ఎల్లూరు గిరిజన ఆశ్రమపాఠశాలలో 210 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ బాత్‌రూంలు సరిగ్గాలేక విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరుగుదొడ్లు అపరిశుభ్రంగామారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఏకరూపదుస్తులు, క్రీడాదుస్తులు, దుప్పట్లుపూర్తిస్థాయిలో అందలేదు.

కమ్మర్‌గాంలో శిథిలావస్థకు చేరిన భవనం..

మండలంలోని కమ్మర్‌గాం ఆశ్రమపాఠశాలలో 99 మంది విద్యార్థులు ఉండగా వారి పరిస్థితి కూడా ఇంచుమించు ఇలానే ఉంది. ముఖ్యంగా భవనం విథిలావస్థకు చేరి పైపెచ్చులు ఊడుతున్నాయి. దోమలు చేరి విద్యార్థులు విషజ్వరాల బారిన పడే అవకాశం ఉంది. ఈ దుస్థితికి కారణం సంబంధిత శాఖాధికారులు పర్యవేక్షణ లోపమేనని విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు

కౌటాల, సెప్టెంబరు 22: మండలంలోని మయూరి విద్యాలయంలో 2012-13విద్యాసంవత్సరంలో చదువు కున్న పూర్వవిద్యార్థులు కలుసుకుని సమ్మేళనం నిర్వహించారు. వివిధ వ్యాపార, ఉద్యోగపరంగా స్థిరపడిన వారంతా ఒకే చోట కలుసుకోవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. 12సంవత్సరాలక్రితం విడిపోయిన వారంతా ఆదివారం ఒకేచోటచేరి తమజ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. తమతో చదువుకున్న విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చినా సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని దాని కోసం నిధులు కూడా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ యాద గిరి, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్స్‌సర్వీస్‌మెన్ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో ఎక్స్‌సర్వీస్ మెన్ అసోసియేసన్ అధ్యక్షుడు శివకుమార్, తదితరులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22: ఎక్స్‌సర్వీస్‌మెన్ సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఎక్స్ సర్వీస్‌మెన్ సమస్యలు పరిష్కరించేందుకు అధికారుకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. పెండింగ్ సమస్యలపై త్వరలోనే కార్యచరణ రూపొందించనున్నట్టు వివరించారు. స్థానిక రుద్రా ఆసుపత్రిలో ఎక్స్‌ఆర్మీ సభ్యులకు 50 శాతం తగ్గింపు ఇవ్వటం శుభపరిణామన్నారు. అలాగే అసోసియేషన్ కోసం తాత్కాలిక హాల్‌ను ఈసుగాంలో బికాస్ గరామి, అమిత్‌బిశ్వాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు

5

సోమవారం 23 సెప్టెంబరు 2024



ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించాలి 7లో..

ఏజెన్సీ ఏస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించాలి 7లో..

కుమ్మరికుంట సర్వేపై ఉత్కంఠ



కుమ్మరికుంట చెరువు ప్రాంతంలోని భవనాలు

చెన్నూరు, సెప్టెంబరు 22: చెన్నూరు పట్టణంలోని ఆస్నాద్ రోడ్డు సమీపంలో ఉన్న కుమ్మరికుంట చెరువు సర్వేపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సర్వే నెంబరు 971లో 16.24 ఎకరాల విస్తీర్ణంతో ఉండాల్సిన చెరువు ప్రస్తుతం 4 ఎకరాలకే పరిమితమైంది. అధికారులు చెరువును సర్వే చేస్తామంటూ స్థానికులకు నోటీసులు అందించడంతో ఆందోళన నెలకొంది. 2014లో ఒకసారి అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించినప్పటికీ 10 సంవత్సరాల తర్వాత మరోసారి హద్దులపై సర్వే చేయడంతో చెరువు పరిసర ప్రాంతాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. మంచిర్యాల కలెక్టరేట్ సమీపంలో ఇటీవల ఓ ఇంటిని అధికారులు కూల్చివేయడంతో కుమ్మరికుంట చెరువు కబ్జాదారుల్లో ఆందోళన నెలకొంది. సంవత్సరాల కింద భూమి కొను గోలు చేసి శాశ్వత నిర్మాణాలు చేసుకున్న భవన యాజమానుల్లో సర్వే భయం రేకెత్తిస్తుంది.

గోదావరి నది వద్ద చెత్తాచెదారం తొలగింపు



గోదావరి పుష్కర ఘాట్ వద్ద చెత్తను తొలగిస్తున్న కమిషనర్, చైర్మన్

నస్పూర్, సెప్టెంబరు 22 : నస్పూర్‌లోని సీతారాంపల్లి గోదావరి పుష్కర ఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారంను స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ఆదివారం మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్‌లు సిబ్బంది సహకారంతో తొలగించి శుభ్రం చేశారు. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనం, అంతకు ముందు వరదల కారణంగా పుష్కర ఘాట్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. మాస్ క్లినింగ్ డ్రైవ్ ద్వారా విగ్రహాల వ్యర్థాలను, చెత్తను తొలగించి శుభ్రం వేశారు. ఈ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ లెక్క... ఇక పక్కా..



- నిగ్గు తేల్చనున్న రెవెన్యూ శాఖ
- ఎల్ఆర్ఎస్ పరిశీలనలో భాగంగా గుర్తింపునకు కసరత్తు
- మూడు శాఖల భాగస్వామ్యంతో ప్రక్రియ
- ప్రభుత్వ చర్యలతో అక్రమార్కుల్లో కలవరం
- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున భూములు అన్యాక్రాంతం
- విచ్చలవిడిగా వెంచర్లు చేసి ప్లాట్ల అమ్మకాలు

మంచిర్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో అసైన్డ్ భూముల గుర్తింపు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల్లో ఎక్కడ అసైన్ భూములు ప్లాట్లుగా మార్చారు..? అందులో ఎన్ని అన్యాక్రాంతమయ్యాయి..? అనే అంశాలపై స్పష్టత రానుంది. ఇదే సమయంలో అసైన్డ్ భూముల లెక్క ఇక పక్కాగా నమోదు కానుంది.

ధరణి రాకతో....

ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తరువాత కబ్జాదారులు కోట్లాది రూపాయల విలువైన అసైన్డ్ భూములను కాజేసి వెంచర్లు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా విక్రయించారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్ల యజమానుల్లో చాలా మందివి ఇలాగే ఉన్నాయి. ఒకసారి అవి రెగ్యులరైజ్ అయితే శాశ్వతంగా వారి సొంతమైనట్లే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు మున్సిపాలిటీల వద్ద పెండింగులో ఉండగా, ఒక్క మంచిర్యాల మున్సిపాలిటీలోనే 600 వీఎల్టీ (వేకేట్ ల్యాండ్ ట్యాక్స్) దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ముగ్గురు అధికారులను నియమించారు. 2020 ఆగస్టు 26వ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయి ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం కల్పించింది. ఆ తేదీ తరువాత అనధికార లే అవుట్లకు, ప్లాట్లకు అనుమతులు జారీ కావు.

అసైన్డ్ భూములపై సర్కారు దృష్టి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేటప్పుడు అసైన్డ్ భూములపైన ప్రధానంగా దృష్టి సారించాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ఎల్ఆర్ఎస్ ఆమోదానికి క్షేత్రస్థాయిలో జరిపే పరిశీలనలో మున్సిపల్ అధికారులతోపాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు భాగస్వామ్యం కల్పించింది. గతంలో మున్సిపాలిటీ అధికారులు, లేదంటే వారి కిందిస్థాయి సిబ్బంది మాత్రమే పరిశీలన జరిపేవారు. మున్సిపాలిటీ వద్ద ఉన్న అరకొర రికార్డుల వల్ల కొన్నిసార్లు అసైన్డ్ స్థలాలు సైతం రెగ్యులరైజ్ అయిన ఉదంతాలున్నాయి. దీనికి తోడు కొందరు మున్సిపల్ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది అసైన్డ్ భూములు అని తెలిసినా ముడుపులకు ఆశపడి రెగ్యులర్ చేసిన దాఖలాలున్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిశీలనలో మున్సిపల్ శాఖతోపాటు రెవెన్యూ, నీటి పారుదల శాఖలను భాగస్వాములను చేస్తోంది.

ఇక గుర్తింపు తేలిక

మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది గతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించేవారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మున్సిపల్ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్‌తోపాటు నీటి పారుదల శాఖ ఏఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తారు. అసైన్డ్ లేదా ప్రైవేటు స్థలామా అనేది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుర్తిస్తారు. చెరువులు, కుంటలు, వాగులు, నాలాల నుంచి ఎంత దూరంలో ఉంది అనేది నీటి పారుదల శాఖ ఏఈ పర్యవేక్షిస్తారు. ఆ స్థలం నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతమా అనేది పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ గుర్తిస్తారు. తద్వారా అసైన్డ్ భూమిని గుర్తించడం తేలిక కానుంది. వీరు ముగ్గురు ఆమోదించాకే ఎల్1 లాగిన్ నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఎల్2 లాగిన్‌కు దరఖాస్తు పంపిస్తారు. అక్కడి నుంచి ఎల్3 లాగిన్ పర్యవేక్షించే మున్సిపల్ కమిషనర్‌కు వెళుతుంది. రుసుం చెల్లించాక కమిషనర్ ఆమోదంతో ఎస్ఆర్ఎస్ పత్రం జారీ చేస్తారు. పెద్ద లే అవుట్‌ల క్రమబద్ధీకరణ రికార్డులను ఎల్4 దశలో భాగంగా కలెక్టర్ల పరిశీలనకు పంపాల్సి ఉంటుంది.

ఎన్‌వోసీల కోసం

ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో ప్లాట్లు వెలిశాయి. 1966 కంటే ముందు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములకు ఎన్‌ఓసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్లు)లు జారీ అయ్యాయి. దాన్ని అవకాశంగా మలచుకొని కొందరు ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టారు. ఇదే అదునుగా కొందరు నకిలీ ఎన్‌వోసీలు సృష్టించి భూములను విక్రయించారు. ఎస్ఆర్ఎస్ దరఖాస్తుల్లో జత చేసిన ఎన్‌వోసీలు ఏవీ నకిలీవో గుర్తించం కష్టంగా మారింది. ఫలితంగా చాలా దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. కొత్త మార్గదర్శకాలతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో వేగం పెరుగనున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమార్కుల్లో గుబులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రధానంగా అసైన్డ్ భూములపై దృష్టి పెట్టనుండడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్లాట్లు కొన్నవారు కలవర పడుతున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదల నుంచి అసైన్డ్ భూములను తక్కువ ధరల కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయించారు. అందులో ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు క్షేత్రస్థాయి పరిశీలనలో అవి అసైన్డ్ భూములని తేలితే ఎక్కడ తమను నిలదీస్తారోనన్న భయం రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెంటాడుతోంది. ఇప్పటికే చాలా మంది తమ ఇంటి స్థలం ఎలాంటి వివాదంలోనైనా చిక్కుకుని ఉందా అనే విషయమై ఆరా తీస్తున్నారు.

న్యూస్ బాక్స్

సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న రంజిత్‌కుమార్

గర్మిళ్ల, సెప్టెంబరు 22: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రిమ్స్ మెడికల్ కాలేజీలో రక్తం ఎక్కించే సెంటర్‌ను ప్రారంభించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌కు ఆదివారం తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్ వినతిపత్రం అందించారు. వ్యాధిగ్రస్తులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను దివ్యాంగులుగా గుర్తించి గత ప్రభుత్వం జీవో నెంబరు 5 జారీ చేసిందని, ఆ జీవోను అమలు చేయాలని విన్నవించారు.

ఆర్యవైశ్య మహాసభ మహిళా ప్రధాన కార్యదర్శిగా సాహితీ



లక్సెట్టిపేటరూరల్, సెప్టెంబరు 22 : మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన నరేందుల సాహితీ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. గతంలో వాసవీ క్లబ్ సెక్రెటరీగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. చలివేం ద్రాలు, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈమె సేవలను గుర్తించి పదవి ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు కొత్తవెంకటేశ్వర్లు తెలిపారు. మహిళల అభివృద్ధికి కృషి చేస్తానని సాహితీ తెలిపారు.

నియామకం

మందమర్రిటౌన్, సెప్టెం బరు 22: జనతాదళ్ (సెక్యులర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మందమర్రికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు వెల్ది సుదర్శన్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దత్తుబాబు నియామకపత్రం అందించారు. మూడున్నర దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్న సుదర్శన్ సేవలను దృష్టిలో ఉంచుకుని పదవి కట్టబెట్టారు.

జిల్లాలో మోస్తరు వర్షం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 22 : జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. భీమారంలో 58.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా తాండూర్‌లో 34.8, కోటపల్లిలో 22.3, చెన్నూరులో 21.3, జైపూర్‌లో 19.8, భీమిని 19.8, జన్నారం 14.8, దండేపల్లి 13.5, మంచిర్యాలలో 7.5, నస్పూర్‌లో 3.5, వేమనపల్లిలో 2.8, లక్సెట్టిపేటలో 2.0. హాజీపూర్‌లో 1.3, కన్నెపల్లి, బెల్లంపల్లిలో 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



చేప పిల్లల పంపిణీకి ప్రణాళిక

- 2.18 కోట్ల చేప పిల్లల పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- ఆలస్యమైన పంపిణీ ప్రక్రియ
- టెండర్లు పూర్తి

నస్పూర్, సెప్టెంబరు 22: ఎట్టకేలకు చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మత్స్యకారులకు ఉపాధిని కల్పించడానికి ఇప్పటికే జిల్లాలో చెరువులు, కుంటల, ప్రాజెక్టుల్లో చేప పిల్లలను వేయాల్సి ఉండగా ఆలస్యమైంది. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటివారంలో చేప పిల్లల పంపిణీ మత్స్య శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 372 చెరువులు, కుంటలు, తొమ్మిది చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల్లో 2.18 కోట్ల చేప పిల్లలను వదిలి పెట్టడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. పిల్లల పంపిణీ ఆలస్యం కావడంతో ఇప్పటికే చాలా చోట్ల మత్స్యకారులు చేప పిల్లలను చెరువుల్లో వేసుకున్నారు. ఆలస్యంగా వేయడం వలన చేప ఆశించిన విధంగా ఎదగదని మత్స్యకారులు అంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో చేప పిల్లల పంపిణీపై మత్స్యకారులు పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది.

● జిల్లాలో ఎక్కడెక్కడ...

జిల్లాలో 18 మండలాలు, 311 గ్రామ పంచాయతీల పరిధిలో 372 కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారంలతో మరో మూడు చిన్న తరహా ప్రాజెక్టులు ర్యాలీ వాగు, నీల్వాయి వాగు, గొల్లవాగులున్నాయి. 125 మత్స్య సహకార సంఘాలుండగా దాదాపు ఏడు వేల వరకు సభ్యులు కొనసాగుతున్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో రవ్వ, బొచ్చ, బంగారు తీగ చేప పిల్లలను వేస్తారు. జూలై, సెప్టెంబరు మాసాల్లో చేప పిల్లలను వదిలిపెట్టాల్సిన ప్రక్రియ ఆలస్యమైంది. పిల్లలు రెండుమూడు కిలోలు, ఇంతకంటే ఎక్కువ రావడానికి దాదాపు నాలుగు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు రెండు మాసాల సమయం పట్టే అవకాశం ఉంటుంది.

● నెలాఖరులో చేప పిల్లల పంపిణీ

జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఈ నెలాఖరు లేదా అక్టోబరు మొదటి వారంలో చేపడుతాం. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియకు నెలన్నర సమయం పడుతోంది.

- జె. భాస్కర్- మత్స్య శాఖ జిల్లా అధికారి

విజన్ ఫీటోకేర్ స్కానింగ్ సెంటర్ ప్రారంభం



స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఐఎంఏ ప్రెసిడెంట్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 22: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో విజన్ ఫీటోకేర్ స్కానింగ్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రమణలు ఆదివారం ప్రారంభించారు. స్కానింగ్ సెంటర్ వైద్యురాలు అరుణజ్యోతి మాట్లాడుతూ హైదరాబాద్‌లో లభించే అత్యాధునిక ఏఐ టెక్నాలజీ, ఆధునిక వసతులతో మంచిర్యాలలో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించాలని కోరారు. కౌన్సిలర్ మినాజ్, చంద్రశేఖర్, గంగాధర్, కృష్ణ మూర్తి, రామస్వామి, రాజమౌళి, తోట రవి, మారుతి, రమేష్ పాల్గొన్నారు.

రక్తదానం



గర్మిళ్ల, సెప్టెంబరు 22: సన్ ఆనిమల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేశారు. ట్రస్టు చైర్మన్ గోపాల్, వైస్‌చైర్మన్ శ్రావణ్‌కుమార్, సభ్యులు సాయికుమార్, రవికుమార్, రాజేష్, మధుకర్, ప్రదీప్‌కుమార్, ఈశ్వరి ప్రసాద్, క్రాంతికుమార్, లక్ష్మణ్, సతీష్, సోమేశ్వర్‌లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు

మార్కెట్‌లో పర్యటించిన ఎమ్మెల్యే



మార్కెట్‌లో కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 22: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆదివారం సాయంత్రం కలెక్టర్ కుమార్‌దీపక్, మున్సిపల్, పోలీస్ అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో పర్యటించారు. మార్కెట్‌లో వెలిసిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కాంప్లెక్స్‌ల కింద సెల్లార్లను పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. కూరగాయల మార్కెట్‌లో రోడ్డు పక్కన ఇటీవల వెలిసిన టేలాలు తొలగించాలన్నారు. గతంలో ఉన్న తొమ్మిది టేలాలకు పాత వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసిన తర్వాత అక్కడ షెడ్లు వేసుకోవాలన్నారు. కూరగాయల మార్కెట్ రోడ్డు మధ్యలో ఉన్న తోపుడు బండ్లను కోటక్ మహేంద్ర బ్యాంక్ రోడ్ మధ్యలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అజయ్ ఎంటర్‌ప్రైజెస్ కాంప్లెక్స్ ఎదుట అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన పొడిగింపు షెటర్లను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దుకాణాల ఎదుట అక్రమణలను తొలగించాలని సూచించారు. ఇవన్నీ పట్టణ అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలే తప్ప ఎవరిపై వ్యక్తిగత కోపాలు లేవని ఎమ్మెల్యే చెప్పారు. బుధవారం నుంచి తొలగింపు ప్రక్రియను చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ఏసీపీ ఆర్.ప్రకాష్, అధికారులు, నాయకులు ఉన్నారు.

సీఎం, ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 22: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి జయశంకర్ చౌరస్తా కూడలి వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ చిత్రపటాలకు ఆదివారం ఐఎన్‌టీయూసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్యలు మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన లాభాల వాటా ఇవ్వడంతోపాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా ఇవ్వడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో సింగరేణి కాంగ్రెస్ హయాంలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. అంతకుముందు రామన్ కాలనీ నుంచి రాష్ట్రీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు సూర్యనారాయణ, నరేందర్, లక్ష్మణ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

నస్పూర్, సెప్టెంబరు 22: నస్పూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆడపడుచులకు బతుకమ్మ పండగ కానుకగా చేపట్టిన చీరలను ఆదివారం వారసంత ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. మున్సిపాలిటీలోని 1, 2, 14, 15, 18, 21, 22, 24, 25 వార్డులకు చెందిన మహిళలకు చీరలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రస్టు నుంచి బతుకమ్మ కానుకగా చీరలను మహిళలకు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు 66వేల మెజార్టీ వస్తే అందులో 21వేల ఓట్లు నస్పూర్‌వేనని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ నూకల రమేష్, కౌన్సిలర్లు కోడూరి లహరి, బండి పద్మ, సంధ్యారాణి, తోట శ్రీనివాస్, మడిగ మల్లయ్య, మహిళ కాంగ్రెస్ నాయకురాలు యశోద, నాయకులు సంపత్ రెడ్డి, ధర్ని మధుకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

వేమనపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని నీల్వాయి గ్రామానికి చెందిన దుర్గం ఇట్టయ్యకు మంజూరైన రూ. 18,500 సీఎం సహాయ నిధి చెక్కును మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ ఆయన కుటుంబీకులకు అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

చెన్నూరు, సెప్టెంబరు 22 : ఎర్రగుంటపల్లిలోని ఆశోక్ అనే రైతు సాగు చేసిన పత్తి పంటను ఓ కంపెనీ ప్రతినిధులు ఆదివారం సందర్శించారు. క్యూబికో అనే మందుతో పురుగులను నివారించినట్లు తెలిపారు. కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.